


## చిన్నమాట

కథ అందరికీ నచ్చే సాహిత్య ప్రక్రియ. బాల్యం నించే మనిషికి కథలంటే ప్రీతి. అందుకే తెలుగులో వార, మాసపత్రికల్లో కథలు తప్పనిసరి. ఆఖరికి ఆదివారం అనుబంధాల్లో కూడా. కథా సరిత్సాగరం, కాశీ మజలీ కథలు, పంచతంత్రం కథలు.... ప్రతి సంస్కృతికీ ఇలాంటి కథలున్నాయి. తెలుగు కథల నేపథ్యానికి విస్తృతి లేదు. ఈనాటికీ అవి ఎదగలేదు. ప్రేమ, కుటుంబం, జానపదం, హాస్యం, ఇంకా ఆఫీసు కథలు, కమ్యూనిస్ట్ కథలు, తెలుగు కథలు ఇలా కేవలం  పరిమిత ఇతివృత్తాల చుట్టూనే తిరుగుతున్నాయి.

కమ్యూనిజం, స్త్రీవాదం, దళితవాదం కథలని అతి గొప్ప కథలుగా చలామణి చేసే ప్రయత్నం  కొన్ని పదుల సంవత్సరాలుగా జరుగుతోంది. కథల పోటీల్లో అవార్డులుకూడా ఈ కథలకే వస్తూండడం కూడా మనం గమనించవచ్చు. ఈ మధ్య యువరచయితలనుంచీ స్వలింగ సంపర్కం లాంటి జుగుప్సాకరమైన కథలు కూడా వస్తున్నాయి.

తెలుగులో ఆ950–ఆ960లలో వెలువడ్డ కథలు ఈనాటికీ గుర్తుండిపోయే మంచి కథలు. ఆనాటి రచయితలు ఏ వాదానికీ కట్టుబడకుండా మానవ జీవితాల్లోని సున్నిత అంశాలతో కథలు రాసారు.

విదేశాల్లో, ముఖ్యంగా అమెరికా, యూరప్‌లలో కథా ఇతివృత్తం ఎంతో విస్తృతమైందని వారి పత్రికలు చదివాక నాకు అర్థమైంది. విపుల మాస పత్రిక ఆరంభించినప్పటినించి నేను వాటిని తెలుగులో అనువదిస్తున్నాను.

చిన్నప్పటినించి నాకు క్రైం కథలంటే ఇష్టం. ఆ రకం కథల ఇతివృత్తాలు కూడా ఎంతో విస్తృతమైనవి. హత్య, పరిశోధనే కాకుండా లాక్డ్ రూమ్ మిస్టరీస్, పజిల్స్, అతీంద్రియ కథలు, ట్విస్ట్ కథలు, హాస్యం, చరిత్ర, జానపద నేపథ్యం, కిడ్నాపింగ్, పగ, ప్రతీకారం, బ్లాక్ మెయిలింగ్ కథలు ఇంకా కిరాయి హంతకులు, వృద్ధులు, పిల్లలు, జంతువులు ప్రధాన పాత్రలుగాగల కథలు, రోడ్ కథలు, హృదయాన్ని స్పందింపచేసే కథలు... ఇలా వాటిలో ఎన్నో డివిజన్స్ ఉన్నాయి.

అలాంటి కథలని తెలుగు పాఠకులు ఈ నెలనించి కౌముదిలో నెలకి ఒకటి చదవగలరు. తెలుగు కథా వీధుల్లో లభ్యం కాని ఈ వినూత్న కథలు మిమ్మల్ని ఆనందింప చేస్తాయని ఆశిస్తూ ...

మీ మల్లాది వెంకట కృష్ణమూర్తి.

# ఒప్పుకోలు
## { మౌరిస్ లెవెల్ కథకి స్వేచ్ఛానువాదం}
## కథ పేరు: ది కన్ఫెక్షన్
## కథా కాలం: 1900

**తెరిచిన తలుపు దగ్గర** నేను కొద్దిసేపు సందేహిస్తూ నిలబడ్డాను. నన్ను తీసుకు వచ్చిన ముసలావిడ లోపలకి రమ్మని మరోసారి నన్ను ఆహ్వానించడంతో ఆవిడని అనుసరించాను.

ఆ గదిలోని కిటికీ తెరలు మూసి ఉన్నాయి. ఓ మూల వెలిగే దీపకాంతి చాలా తక్కువగా ఉంది. మంచం మీదున్న శుష్కించిన ఓ ముసలాయన్ని చూసాను. ఆ గదిలో స్వల్పంగా స్పిరిట్ వాసన వేస్తోంది.

"మన్సూర్. మీరు తీసుకురమ్మన్న పెద్దమనిషి వచ్చారు" ముసలావిడ ఆయనతో చెప్పింది.

"మంచిది. థాంక్స్. మమ్మల్ని వంటరిగా మాట్లాడుకోనీ" ఆయన కంఠం కూడా బలహీనంగా ఉండటం గమనించాను. ఆవిడ బయటకి వెళ్ళి తలుపు మూసాక ఆయన చెప్పాడు.

"నా దగ్గరగా రండి మన్సూర్. నేను దాదాపు గుడ్డివాడిని. నా చెవుల్లో ఏదో రొద వినిపిస్తుంది కాబట్టి కుర్చీని నా మంచం దగ్గరకి లాక్కుని కూర్చోండి. మిమ్మల్ని పిలిపించినందుకు క్షమించండి. కాని మీకు చెప్పాల్సిన ఓ ముఖ్యమైన విషయం ఉండబట్టి పిలిపించాల్సి వచ్చింది."

ఆయన కళ్ళు నన్ను చూస్తున్నా చూడనట్లుగా ఉన్నాయి. కొద్ది క్షణాల తర్వాత ఆయన మృదువుగా అడిగాడు.

"మీరు బార్ – ఎట్ – లా లీడర్ మన్సూర్ గెర్నోవ్ కదా?"

"అవును" జవాబు చెప్పాను.

ఆయన తృప్తిగా నిట్టూర్చి చెప్పాడు.

"చిట్టచివరకి నేను నా తప్పుని మీ ముందు ఒప్పుకోగలుగుతున్నాను. నేను ఆ తప్పు ఒప్పుకోలు ఉత్తరం మీద పియర్ అని సంతకం చేసాను. కాని అది నా అసలు పేరు కాదు. మృత్యువు నాకు బాగా దగ్గరగా వచ్చాక నా మొహంలో మార్పు వచ్చినా, మీరు పరిశీలనగా చూస్తే గుర్తుపట్టగలరేమో చూడండి."

నేనాయన్ని గుర్తుపట్టలేదని చెప్పాక ఆయన తను చెప్పేది తిరిగి కొనసాగించాడు.

"కొన్నేళ్ళ క్రితం ... నిజానికి చాలా ఏళ్ళ క్రితం నేను ఫ్రెంచ్ రిపబ్లిక్‌కి ప్రాసిక్యూటర్ని. నేను నా సమర్ధతని ఋజువు చేసుకునే అవకాశం కోసం ఎదురు చూస్తున్నాను. అందుకు ఒక కేసు నాకు మంచి అవకాశాన్ని ఇచ్చింది. అది ఓ చిన్న

ఊళ్ళో జరిగింది. పేరిస్‌లో ఐతే అది ఎవరి దృష్టినీ ఆకర్షించి ఉండకపోవచ్చు. కాని ఆ ఊళ్ళో మాత్రం అందరి దృష్టిలో పడింది. ముద్దాయి మీద ఆరోపించబడ్డ నేరం తీవ్రమైంది. ఐతే చాలామంది ముద్దాయిల్లా అతను తన నేరాన్ని అంగీకరించలేదు. అతను తను నిర్దోషిని అని నిరూపించుకోడానికి చాలా కృషి చేసాడు. అతనికి వ్యతిరేకంగా చాలా ఋజువులు లభించాయి. అవి అతను స్వయంగా నేరాన్ని అంగీకరించడంతో సమానమైనవి. తను నిరపరాధినని కన్నీళ్ళతో జడ్జ్‌కి చెప్పాడు. అది అందరిలో అతనిమీద సానుభూతిని కలిగించింది కూడా. కొందరిలో 'అతను అసలు నిజంగా అపరాధేనా?' అనే అనుమానం కలిగింది. భావనలు ఎంత బలమైనవో మీకు తెలిసిందేగా. ఐతే అవి మేజిస్ట్రేట్ తీర్పుని ప్రభావితం చేయలేవు. అతను నిరాకరించిన ప్రతీదానికి వ్యతిరేకంగా నేను సాక్ష్యాలని ప్రవేశపెట్టాను. అతని బలహీనతలని, జీవితంలో చేసిన అనేక తప్పులని సేకరించి మేజిస్ట్రేట్ ముందు ఉంచాను. జ్యూరీ సభ్యులకి అతను నేరం చేసిన విధానాన్ని కళ్ళకి కట్టినట్లుగా వివరించాను. అతని తరపు లాయర్ నేను చెప్పిందాన్ని ఖండిస్తూ వాదనలు చేసినా అవన్నీ నిరుపయోగమయ్యాయి."

ఆయన కొద్దిసేపు ఆగి ఊపిరి తీసుకుని తిరిగి కొనసాగించాడు.

"అతనికి శిరచ్ఛేద దండనని విధించమని కోర్టుని కోరాను. నేనా కేసులో గెలవాలనే కాంక్ష ఆ ఖైదీ మీద నాకు గల సానుభూతిని అణచివేసింది. అతని దండన చట్టానికి, నా కెరీర్ ఎదుగుదలకి విజయంగా నేను భావించాను. అతన్ని నేను మళ్ళీ అతనికి మరణ శిక్ష విధించే రోజు  జైల్లో చూసాను. అతన్ని గిలెటిన్ యంత్రం మీదకి తీసుకెళ్ళినప్పుడు, అతని బాధాకరమైన మొహాన్ని చూడగానే అకస్మాత్తుగా నా మనసులో నేను చేసింది తప్పేమో అనే అనుమానం కలిగింది. ఆ భయంకర గంటలోని ప్రతీక్షణం నా జ్ఞాపకాలో ఇంకా సజీవంగా ఉంది. అతని కాళ్ళూ, చేతులకి సంకెళ్ళు వేస్తూంటే చాలామంది ఖైదీల్లా అతను ఎదురు తిరగలేదు. నేను అతని వంక చూడలేకపోయాను. కరుణతో ప్రశాంతంగా ఉన్న అతని కళ్ళు నన్నే చూడసాగాయి. అతను గిలెటిన్ దగ్గరకి వెళ్ళాక రెండు సార్లు అరిచాడు.

'నేను అమాయకుడ్ని...నేను అమాయకుడ్ని.'

తర్వాత నా వైపు తిరిగి చెప్పాడు.

'నా తల నా శరీరం నించి వేరవడం చూడు. అది నీ పనికి నీకు దొరికే బహుమతి.'

అతను ఎవరి సహాయం లేకుండా గిలెటిన్ ముందున్న చెక్కమీదకి నడిచి నిర్భయంగా తన మెడని ఆ యంత్రంలో ఉంచాడు. ఆ తర్వాత నా ఆలోచనల్లో అయోమయం ఏర్పడి అతని మరణం నన్ను వెంటాడసాగింది.

'మొదటిసారి ఎవరికైనా ఇలాగే అనిపిస్తుంది' నా పరిస్థితిని గమనించిన నా కొలీగ్స్ చెప్పారు. అది నేను నమ్మాను. కాని క్రమంగా  నేను అతని మరణాన్ని మర్చిపోలేకపోవడానికి కారణం 'ఒకవేళ అతను నమ్మకంగా చెప్పినట్లుగా నిర్దోషి అయి ఉంటే?' అనే అనుమానం అని అర్థమైంది. అప్పటినించి నేను మనశ్శాంతిని కోల్పోయాను. నేనా అనుమానంతో

తీవ్రంగా పోరాడాను. అతను దోషి అనే నిజమైన ఋజువు కోసం ఆలోచిస్తే నాకు ఒక్కటీ తట్టలేదు. ఆ తర్వాత తరచు ఆ ఖైదీ జీవితంలోని ఆఖరి నిమిషాలు, అతని ప్రశాంతమైన కళ్ళు గుర్తుకు రాసాగాయి. నేను ఒంటరిగా ఉన్నప్పుడు గిలెటిన్ మీద అతను నాకు కళ్ళకి కట్టినట్లుగా కనపడేవాడు. తను నిర్దోషినని ఎంతగా ప్రార్ధించిన నేనా వాదనని నెగ్గనివ్వలేదు. నా మాట మీదే మెజిస్ట్రేట్ అతనికి మరణ శిక్షని విధించాడు. ఆఖరిగా తీర్పుని ఇవ్వబోయే ముందు మేజిస్ట్రేట్ తటపటాయిస్తూ నన్ను అడిగాడు. 'అతను నేరస్థుడని మీరు గట్టిగా నమ్ముతున్నారా?'

'అవును.' నేను తడబడకుండా సూటిగా జవాబు చెప్పాను. అది మేజిస్ట్రేట్‌లో ఉన్న అన్ని అనుమానాలని పారద్రోలింది. అతను అమాయకుడైతే అతని మరణానికి బాధ్యత నాదే. ఏ ముద్దాయి అయినా అంత గట్టిగా పోరాడగలడని తర్వాతి అనుభవాలని బట్టి నేను గ్రహించాను.

"ఆ తర్వాత అతని ఫైల్‌ని అనేకసార్లు చదివి, ఋజువుల్ని పరిశీలించాను. అవన్నీ నా వాదన వైపుకి చెందినవి. అతని వాదన వైపు నించి చూస్తే అవి సరైన ఋజువులు కావని నాకే అనిపించసాగింది. అందుకే ఎటూ తేల్చుకోలేని మేజిస్ట్రేట్ నన్నా ప్రశ్న వేశాడని అనిపించింది. నేను నా కెరీర్లో పైకి రావాలనే కోరికకి బానిసై, పక్షపాత ధోరణిలో అతన్ని దోషిని చేసాను అని నాకు ఆ తర్వాత చాలాసార్లు అనిపించింది. అతన్ని అడిగిన ప్రశ్నలకి అతని జవాబులని చదివాను. పక్షపాతాన్ని పక్కన పెడితే అతను చెప్పింది నిజమే అని నాకు అనిపించింది. ఓ కొత్త సాక్షి చెప్పింది నేను నిర్లక్ష్యం చేసాను. అతను దోషి అని ముందే నిర్ణయించుకుని ఆ ప్రకారం నేనా కేసుని పెంపొందించాను.

"చివరికి నా మస్సాక్షే గెలిచింది. నేను నా పిరికితనాన్ని వదిలి నా ఉద్యోగానికి రాజీనామా ఇచ్చేసాను. ఫలితంగా నా కుటుంబాన్ని పోషించలేక ఓడల్లో పనిచేస్తూ చాలా దేశాలు తిరిగాను. ఐతే జ్ఞాపకం అనేది ప్రదేశం మారితే పోయేది కాదని అర్థమైంది. నేను చేసిన పొరపాటుని సరిదిద్దుకోవడమే నా జీవిత లక్ష్యంగా మారింది. విచారిస్తే అతను కుటుంబ సభ్యులు కాని, మిత్రులు కాని లేని దేశదిమ్మరి అని తెలిసింది.

"నేను చేయగలిగింది ఒకటి ఉంది. నా పొరపాటుని కోర్ట్ ముందు ఒప్పుకోవడం. ఐతే అందుకు నాకు ధైర్యం చాలలేదు. కోర్ట్, నా సమాజం, మిత్రులు నన్ను ఏవగించుకోవడం నేను భరించలేక నా ఆస్థిని కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోడానికి పరిహారంగా వినియోగించదలిచాను. ముఖ్యంగా కోర్టులో దోషులుగా నిందించబడే బీద నిర్దోషులకి న్యాయసహాయం కోసం వినియోగించాను.

"నా జీవితంలో లభించే అన్ని ఆనందాలని నేను వదులుకున్నాను. అందరూ నన్ను మర్చిపోయారు. ఫ్రాన్స్‌కి తిరిగి వచ్చాక నేను ఒంటరిగా జీవించసాగాను. మధ్యవయస్కుడిగా ఉండగానే నాలో వృద్ధాప్య లక్షణాలు వచ్చేసాయి. నా జీవితావసరాలని అతి తక్కువకి కుదించుకున్నాను. నెలల తరబడి ఈ గదిలోంచి బయటకి రాలేదు. దాంతో నాకీ

ప్రాణాంతక రోగం వచ్చింది. మన్సూర్. మిమ్మల్ని పిలిపించడానికి కారణం నేను ఇవాళో, రేపో మరణించబోతున్నాను. నేను మిమ్మల్ని కోరేది ఒక్కటే."

ఆయన కంఠం వణుకుతూ అతి మెల్లిగా వినిపించసాగింది. ఆ మాటలకి వినడానికి నేను నా చెవిని ఆయన నోటివైపు చాపాను.

"నా కథ నాతో మరణించడం నాకు ఇష్టంలేదు. న్యాయ విచారణలో భాగాన్ని, బాధ్యతని పంచుకునే అందరికీ నా కథ పాఠాన్ని నేర్పాలి. అలాంటివారు, అది తమ ఉద్యోగంగా భావించి ప్రతీ ముద్దాయికీ శిక్షపడేలా చేయాలని అనుకోవడం సబబు కాదని, వ్యామోహంలో ఏదో నేరం చేసేవాళ్ళని పైన ఉన్న అసలు ప్రాసిక్యూటర్ శిక్షిస్తాడని తెలుసుకోవాలని చాటాలని అనుకున్నాను. కాబట్టి మీరు దీని గురించి అందరికీ చెప్పండి. పేపర్లలో రాయండి."

"అలాగే. తప్పకుండా" ఆయన చేతి మీద తట్టి హామీ ఇచ్చాను.

ఆయన మొహంలో ఆ క్షణంలో కొంత వెలుగు ప్రవేశించడం గమనించాను.

"అంతేకాదు. నేను ఇంకా పంచకుండా మిగిలిపోయిన నా సొత్తుని కూడా మీరు దురదృష్టవంతులైన ముద్దాయిలని విడిపించడానికి పంచాలి. నేను మరణించాక దయచేసి మీరా బాధ్యత తీసుకోండి."

"అలాగే."

"నా పేరు న కాదు. రనైలే పేరు మీద."

వెంటనే నేను ఉలిక్కిపడ్డాను.

"రనైలే? అతని తరఫున వాదించింది నేనే."

అతను తలవంచి అభివాదం చేసి చెప్పాడు.

"అది నాకు తెలుసు. అందుకే మిమ్మల్ని పిలిపించాను. ఈ ఒప్పుకోలుని స్వీకరించడానికి మీరే అర్హులు. ఆ కేస్‌లో నేను పబ్లిక్ ప్రాసిక్యూటర్ని. అతను రనైలే. రనైలే! నన్ను క్షమించు" బాధగా చెపుతూ తన చేతిని పైకి ఎత్తాడు.

నా వృత్తిపరమైన రహస్యాన్ని బయటకి చెప్పొచ్చా? లాయర్‌గా అనుసరించాల్సిన నియమాలని నేను అతిక్రమించచ్చా? అనే ప్రశ్నలు నాలో ఉదయించినా, బాధపడే ఆయన్ని చూసాక తొలిగిపోయాయి.

"మన్సూర్ డాక్స్.. మన్సూర్ డాక్స్.. రనైలే నిజంగా దోషి. అతను గిలెటిన్ మీదకి వెళ్ళే ముందు అది నా ముందు రహస్యంగా ఒప్పుకున్నాడు. అతని తరఫున నేను సమర్ధవంతంగా పోరాడినందుకు కృతజ్ఞతగా ఆ రహస్యాన్ని చెపుతున్నాన్ని చెప్పాడు" ఆయన చెవిలో అరిచి చెప్పాను.

ఐతే అప్పటికే ఆయన చెయ్యి కిందకి వాలిపోయింది. నేను చెప్పింది ఆయన విన్నాడనే, ఆయన ఆత్మకి శాంతి చేకూరిందనే నమ్మడానికి నేను ప్రయత్నిస్తున్నాను.

Post your comments

(వచ్చేనెల మరో కథ)